


# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 ఆదివారం 18-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర

- చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు
- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ
- గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం
- తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు.

## ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి




- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు.

## గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా

- కానీ నీళ్ల కోసం యుద్ధమే: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- ఏదుల నుంచి డిండికి నీటిని తరలించడాన్ని అంగీకరించేది లేదన్న అనిరుధ్ రెడ్డి
- పాలమూరు నీళ్ల కోసం గురువునైనా ఎదిరిస్తానని వ్యాఖ్య
- తనకు పాలమూరు ప్రయోజనాలే ముఖ్యమన్న అనిరుధ్




## అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం

- రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తామని మంత్రి పొన్నం హామీ
- అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తామని వెల్లడి
- సీసీఎస్ బకాయిల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి



తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు. వారి పెండింగ్ బకాయిలను- మిగతా 2 లో

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన..
- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ




### యూపీలో యోగి హవా సర్వేలో స్పష్టమైన
## ఆధిక్యం విపక్షాలకు షాక్




- యూపీ తదుపరి సీఎంగా యోగి ఆదిత్యనాథ్‌కే ప్రజల మొగ్గు
- యోగికి 66.2 శాతం, అఖిలేష్ యాదవ్‌కు 24.4 శాతం మద్దతని సర్వేలో వెల్లడి
- యోగి ప్రభుత్వ పనితీరుపై 77 శాతం మందికి పైగా సంతృప్తి
- శాంతిభద్రతలే కీలక ఎన్నికల అంశమని తెలిపిన ఓటర్లు
- ఎన్డీఏకు 66.6 శాతం, ఎస్పీ-కాంగ్రెస్ కూటమికి 26.4 శాతం ఓట్లని అంచనా

## ఘోర బస్సు ప్రమాదం
### లోయలో పడిన వాహనం, 8 మంది మృతి!



- రాజస్థాన్‌లో బస్సు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి
- మృతుల్లో ఐదుగురు మహిళలు, మరో 17 మందికి గాయాలు
- భోపాల్ నుంచి ఖాటూ శ్యామ్‌కు వెళ్తుండగా ప్రమాదం
- డ్రైవర్ నిద్ర మత్తుతో బస్సు అదుపు తప్పినట్లు ప్రాథమిక సమాచారం
- క్షతగాత్రులకు కోటాలోని రెండు ఆసుపత్రుల్లో చికిత్స- మిగతా 2 లో

## బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత: 20 మంది పోలీసుల కిడ్నాప్



- బలూచిస్థాన్‌లో 20 మంది పోలీస్ రిక్రూట్‌లను అపహరించిన సాయుధులు
- ఇది బలోచ్ వేర్పాటువాదుల పనేనని అనుమానం
- రాష్ట్రంలో బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాలపై తీవ్ర ఆరోపణలు
- పాక్ భద్రతా బలగాల ఆధీనంలో పలువురు టీచర్ల మృతి చెందినట్లు ఆరోపణలు- మిగతా 2 లో

## రిలయన్స్‌తో పోటీకి సై

- స్టార్‌లింక్ సిద్ధమంటూ మస్క్ ప్రకటన!రిలయన్స్ ప్రకటనపై 'ఎంతో అభినందిస్తున్నా' అంటూ మస్క్ స్పందన
- భారత్‌లో హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలకు సిద్ధమన్న స్టార్‌లింక్
- దేశంలో ప్రత్యేక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడి
- ఐదేళ్లుగా భారత నియంత్రణ సంస్థలతో కలిసి పనిచేస్తున్న సంస్థ
- స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి మరికొన్ని ప్రభుత్వ అనుమతుల అవసరం



భారత్‌లో స్టార్‌లింక్ సేవలు- మిగతా 2 లో

## రష్యా ఆంక్షల చట్టంపై ట్రంప్ అనూహ్య నిర్ణయం

### భారత్‌కు భారీ ఊరట!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రష్యా, ఇరాన్‌లను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన కఠినమైన చట్టంలోని

- రష్యాపై కఠిన ఆంక్షల చట్టానికి ట్రంప్ మినహాయింపు
- భారత్, చైనా వంటి దేశాలకు తప్పిన పెను ముప్పు
- రష్యా ఇంధనాన్ని దిగుమతి చేసుకునే దేశాలపై ప్రభావం నివారణ
- జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- అమల్లోకి రావడానికి ఒక రోజు ముందు కీలక ఉత్తర్వులు



# పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి–కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి–బనకచర్ల, గోదావరి–నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి–కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

# గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా

మొదటిపేజీ తరువాయి – జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ గురువైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం తన తలనైనా నరుక్కుంటానని... కానీ పాలమూరు ప్రాంత నీటి హక్కుల విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీళ్ల కోసం అవసరమైతే గురువుతోనైనా యుద్ధం చేస్తానని, తన ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని తేల్చిచెప్పారు. జడ్చర్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల మధ్య నీటి కేటాయింపుల వివాదంపై ఆయన తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. ముందుగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరుకు నీరందించాకే, డిండికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కేవలం 60 శాతమే పూర్తయ్యాయని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కోసం జేఏసీ తలపెట్టిన జలదీక్షకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రాజెక్టు సాధన కోసం పాలమూరు ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడతామని చెప్పారు. అదే సమయంలో, ప్రతి అంశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనవసరంగా లక్ష్యంగా చేసుకోవద్దని ఆయన హితవు పలికారు.

# రిలయన్స్‌తో పోటీకి సై

మొదటిపేజీ తరువాయి – ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ సంస్థ ప్రకటించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ పోటీపై చేసిన ప్రకటనకు స్పందిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. దీనిపై ఎలాన్ మస్క్ 'ఎంతో అభినందిస్తున్నా' అంటూ 'ఎక్స్'లో స్పందించారు. భారత మార్కెట్‌లో స్టార్‌లింక్ ప్రవేశంపై మస్క్, రిలయన్స్ మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. స్టార్‌లింక్ భారత్‌లో ఐదేళ్లకు పైగా ప్రభుత్వ నియంత్రణ సంస్థలు, పరిశ్రమలు, టెలికాం ఆపరేటర్లతో కలిసి పనిచేస్తోందని తెలిపింది. భారత వినియోగదారులకు సురక్షితంగా సేవలు అందించేందుకు దేశంలోనే ప్రత్యేక వ్యవస్థలు, గేట్‌వేలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. వీటికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని పేర్కొంది. భారత్‌కు హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. శాటిలైట్ కమ్యూనికేషన్ల రంగంలో స్టార్‌లింక్ సహా అన్ని సంస్థల పోటీని స్వాగతిస్తున్నట్లు రిలయన్స్ శుక్రవారం ప్రకటించింది. భారతీయ సంస్థలైనా, విదేశీ కంపెనీలైనా దేశ చట్టాలు, విధానాలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. జియో శాటిలైట్ సేవలు కూడా అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపింది. ఈ పరిణామాలకు ముందు మస్క్.. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. భారత్‌లో గుత్తాధిపత్యాన్ని కొనసాగించాలని చూస్తున్నారంటూ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. అంబానీని 'భారత్‌కు అసలైన అధిపతి' అంటూ వ్యంగ్యంగా సంబోధించారు. స్టార్‌లింక్‌ను భారత మార్కెట్‌లో పోటీ పడనిస్తారా? అని ప్రశ్నించారు. భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్ లైసెన్స్ పొందినప్పటికీ, వాణిజ్యపరంగా సేవలు ప్రారంభించేందుకు భద్రతాపరమైన అనుమతులు సహా మరికొన్ని ప్రభుత్వ ఆమోదాలు రావాల్సి ఉంది.

# యూపీలో యోగి హవా.. సర్వేలో స్పష్టమైన ఆధిక్యం.. విపక్షాలకు షాక్



మొదటిపేజీ తరువాయి – ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని అంచనా వేస్తూ 'న్యూస్18 యూపీ' నిర్వహించిన మెగా సర్వేలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తిరుగులేని ఆధిక్యం లభించింది. తదుపరి ముఖ్యమంత్రిగా యోగినే ఉండాలని సర్వేలో పాల్గొన్న వారిలో 66.2 శాతం మంది అభిప్రాయపడగా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌కు కేవలం 24.4 శాతం మద్దతు మాత్రమే లభించింది. 'పీవాల్యూ అనలిటిక్స్'తో కలిసి 'న్యూస్18' ఈ సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా యూపీలోని 75 జిల్లాల్లో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2, 2026 మధ్య 30,925 మంది అభిప్రాయాలను సేకరించారు. ఈ సర్వేలో బీఎస్పీ అధినేత్రి మాయావతికి 5 శాతం, చంద్రశేఖర్ ఆజాద్‌కు 1.8 శాతం మంది మద్దతు తెలిపారు. యోగి ప్రభుత్వ పనితీరుపై ఏకంగా 77.1 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. వీరిలో 52.8 శాతం చాలా సంతృప్తిగా, 24.3 శాతం కొంతమేర సంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. శాంతిభద్రతల విషయంలో 74 శాతం, మౌలిక సదుపాయాలపై 68.6 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఉపాధి కల్పన విషయంలో ప్రభుత్వ పనితీరు బలహీనంగా ఉందని సర్వే సూచించింది. అయినప్పటికీ, 58.3 శాతం మంది ఉపాధి విషయంలో సంతృప్తిగానే ఉన్నామని తెలిపారు. ఓటింగ్ విషయానికొస్తే, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి 66.6 శాతం మంది ఓటేస్తామని చెప్పగా, ఎస్పీ–కాంగ్రెస్ కూటమికి 26.4 శాతం మద్దతు పలికారు. రాష్ట్రంలో శాంతిభద్రతలే అత్యంత కీలకమైన ఎన్నికల అంశమని 33.4 శాతం మంది పేర్కొన్నారు. యోగికి కేవలం బీజేపీ మద్దతుదారులే కాకుండా, ఎస్పీ–కాంగ్రెస్ కూటమి మద్దతుదారుల్లో 11.7 శాతం మంది, బీఎస్పీ మద్దతుదారుల్లో 10.2 శాతం మంది కూడా తదుపరి సీఎంగా ఆయన వైపు మొగ్గు చూపడం విశేషం.

# బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత: 20 మంది పోలీసుల కిడ్నాప్



మొదటిపేజీ తరువాయి – పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బలోచ్ వేర్పాటువాదులుగా అనుమానిస్తున్న కొందరు సాయుధులు, శిక్షణలో ఉన్న 20 మంది పోలీసు సిబ్బందిని అపహరించారు. శుక్రవారం సాయంత్రం మస్తుంగ్ జిల్లాలోని గోర్గినా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కలాత్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ నుంచి సెలవుపై తమ స్వగ్రామాలకు వెళుతున్న పోలీస్ రిక్రూట్‌లు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను సాయుధులు అడ్డగించి, వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పాకిస్థాన్ భద్రతా బలగాలు, అపహరణకు గురైన పోలీసుల ఆచూకీ కోసం భారీ గాలింపు చర్యలు చేపట్టాయి. మస్తుంగ్ జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఇదే క్రమంలో, టర్బత్ సమీపంలో కొన్ని సరుకు రవాణా ట్రక్కులకు కూడా బలోచ్ వేర్పాటువాదులు నిప్పుపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

### తెరపైకి కస్టడీ మరణాల ఆరోపణలు

ఈ దాడుల నేపథ్యంలో, బలూచిస్థాన్‌లో సుదీర్ఘ కాలంగా పాక్ భద్రతా దళాలపై వస్తున్న బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాల ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలే, పర్వేజ్ అనే పాఠశాల ఉపాధ్యాయుడి మృతదేహం పాస్నిలో లభ్యమైంది. అంతకు ఒకరోజు ముందు, కుటుంబ సభ్యుల సమక్షంలోనే పాక్ భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకున్నాయని 'ది బలూచిస్థాన్ పోస్ట్' కథనం ప్రచురించింది. పర్వేజ్ అరెస్టు, మరణంపై పాక్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది ఇలాంటి ఘటనలు పెరిగాయని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆగస్టులో, పంజ్‌గూర్‌కు చెందిన హాతిమ్ బలోచ్ అనే మరో ఉపాధ్యాయుడిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించగా, కొన్ని వారాల తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా, గత ఏడాది అక్టోబర్‌లో పాక్ బలగాలు అదుపులోకి తీసుకున్న అయాజ్ బలోచ్ అనే ఉపాధ్యాయుడి మృతదేహం ఈ ఏడాది జనవరిలో లభించింది.

### నివేదికలో సంచలన విషయాలు

'బలోచ్ యక్‌జెహతీ కమిటీ (బీవైసీ)' విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ వరకు బలూచిస్థాన్‌లో 507 బలవంతపు అదృశ్యాలు నమోదయ్యాయి. వీరిలో 135 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు ఉండటం గమనార్హం. వీరిలో 32 మంది కస్టడీలోనే మరణించారని ఆ సంస్థ ఆరోపించింది. తాజాగా కిడ్నాప్ ఘటన జరిగిన మస్తుంగ్ జిల్లాలోనే అక్టోబర్ 9న ఓ ఇంటిపై డ్రోన్ దాడి జరగగా ఇద్దరు పౌరులు గాయపడ్డారు. జనవాసాలపై పాక్ సైన్యం డ్రోన్లు, ఫైటర్ జెట్లతో దాడులు చేస్తూ పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని బీవైసీ ఆరోపించింది. ఒకవైపు వేర్పాటువాదుల దాడులు, మరోవైపు భద్రతా దళాలపై వస్తున్న తీవ్ర ఆరోపణలతో బలూచిస్థాన్‌లో సామాన్య పౌరుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

# ఘోర బస్సు ప్రమాదం



మొదటిపేజీ తరువాయి – ఢిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. రాజస్థాన్‌లోని కోటా సమీపంలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం.. బస్సులో 27 మంది ప్రయాణిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. డ్రైవర్ నిద్ర మత్తు వల్లే బస్సు అదుపు తప్పింది. రక్షణ కంచెను ఢీకొట్టి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో మరణించిన ఎనిమిది మందిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 17 మందిని కోటాలోని ఎంబీఎస్ ఆసుపత్రి, న్యూ మెడికల్ కాలేజీ ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఎవరి పరిస్థితీ విషమంగా లేదని అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం ఉదయం 8 గంటల సమయంలో అందినట్లు వెల్లడించారు. కోటా జిల్లా కలెక్టర్ పీయూష్ సమారియా, ఐజీ హరేంద్ర మహావర్ ఎంబీఎస్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అందుబాటులో ఉన్న నాలుగు అంబులెన్సులనూ ప్రమాద స్థలానికి పంపించారు. క్షతగాత్రులను వీలైనంత త్వరగా ఆసుపత్రులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

# రష్యా ఆంక్షల చట్టంపై ట్రంప్ అనూహ్య నిర్ణయం

మొదటిపేజీ తరువాయి – పలు కీలక నిబంధనలకు మినహాయింపునిస్తూ శుక్రవారం రాత్రి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'గా పిలిచే ఈ చట్టం అమల్లోకి రావడానికి కేవలం ఒక రోజు ముందు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చర్య ద్వారా రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా వంటి దేశాలకు తక్షణమే భారీ ఊరట లభించినట్లయింది.

### ఏమిటీ చట్టం? దాని ప్రభావం ఎంత?

సెప్టెంబర్ 18న ట్రంప్ సంతకం చేసిన ఈ చట్టం, రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా రూపొందించబడింది. ఈ చట్టంలోని నిబంధనలు అమల్లోకి వస్తే, రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100% వరకు టారిఫ్‌లు విధించే అధికారం అమెరికాకు లభిస్తుంది. అదేవిధంగా, రష్యా ఇంధన ఉత్పత్తులపై అధిక సుంకాలు, ఆంక్షల ఉల్లంఘనకు సహకరించే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుంది. ప్రపంచంలో రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారులుగా ఉన్న భారత్, చైనాలపై ఈ చట్టం తీవ్ర ప్రభావం చూపిస్తుందని ముందునుంచే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. తాజా మినహాయింపుతో ఆ దేశాలపై పడాల్సిన ఆర్థిక భారం ప్రస్తుతానికి తప్పింది.

### జాతీయ ప్రయోజనాల కోసమేనన్న ట్రంప్

అమెరికా జాతీయ ప్రయోజనాల దృష్ట్యానే ఈ మినహాయింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన నివేదికను, ధృవీకరణ పత్రాన్ని అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించారు. ఈ ఉత్తర్వుల ద్వారా చట్టంలోని సెక్షన్ 112, 113 కింద విధించాల్సిన సుంకాలను, రష్యా ఇంధన కార్యకలాపాలతో సంబంధం ఉన్న విదేశీ సంస్థలు, వ్యక్తులపై విధించాల్సిన పలు ఆంక్షలను తక్షణమే నిలిపివేశారు. అయితే, ఈ మినహాయింపు కేవలం తాత్కాలికమేనని, భవిష్యత్తులో అవసరమైతే ఈ ఆంక్షలను పునరుద్ధరించే అధికారం అధ్యక్షుడికి ఉంటుందని స్పష్టమవుతోంది.

### భారత్ వాదనకు బలం

ట్రంప్ నిర్ణయం భారత్‌కు వ్యూహాత్మకంగా పెద్ద ఊరట. తన ఇంధన భద్రత అవసరాల కోసం వివిధ దేశాల నుంచి ఇంధనాన్ని సేకరించడం తప్పనిసరి అని భారత్ మొదటి నుంచి అమెరికాతో జరిపిన చర్చల్లో బలంగా వాదిస్తూ వస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కేవలం తమ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికేనని స్పష్టం చేసింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం పరోక్షంగా భారత్ వాదనకు బలం చేకూర్చినట్లయింది. రష్యాతో అమెరికా చర్చలు జరుపుతున్న తరుణంలో, అలాగే ఉక్రెయిన్ నాయకత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతానికి ఈ మినహాయింపుతో భారత్, చైనాలు ఊపిరి పీల్చుకున్నప్పటికీ, అమెరికా భవిష్యత్ వైఖరిపైనే తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

# భూమాతకు జ్వరం!..

# ప్రమాదకర స్థాయికి ఏడు కీలక సూచికలు

మొదటిపేజీ తరువాయి – నేతృత్వంలోని అంతర్జాతీయ నిపుణుల బృందం రూపొందించిన '2026 స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ రిపోర్ట్' ఈ చేదు నిజాలను వెలుగులోకి తెచ్చింది. ప్రతిష్ఠాత్మక 'బయోసైన్స్' జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. మానవ శరీరంలోని రక్తపోటు, నాడీ చలనం వంటి 16 ప్రాణాధారాలను పరీక్షించినట్లే, భూమి ఆరోగ్యానికి సంబంధించిన కీలక సూచికలను (వైటల్ సైన్స్) శాస్త్రవేత్తలు విశ్లేషించారు. వీటిలో ఏడు సూచికలు మునుపెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయని, మిగిలినవి కూడా ప్రతికూల దిశలో పయనిస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది.

### నివేదికలోని కీలక అంశాలు

2026 మే నాటికి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ (జూ2) స్థాయి 428 పార్ట్స్ పర్ మిలియన్ (జూజూఎ)కు చేరింది. ఇది పారిశ్రామిక విప్లవానికి ముందు నాటి స్థాయుల కంటే 50 శాతం అధికం కాగా, గత 20 లక్షల సంవత్సరాలలో ఇదే అత్యధికం. కార్బన్ డయాక్సైడ్ కంటే 28–36 రెట్లు ఎక్కువ వేడిని బంధించే మీథేన్ (జుం4), 265–298 రెట్లు శక్తివంతమైన నైట్రస్ ఆక్సైడ్ (చీ2ూ) కూడా రికార్డు స్థాయిలకు చేరుకున్నాయి. ఇంధన సంబంధిత కార్బన్ ఉద్గారాలు తొలిసారిగా 41 గిగాటన్నులను దాటాయి.

వీటితో పాటు సముద్ర మట్టాలు, సముద్ర గర్భంలోని ఉష్ణోగ్రతలు, కరిగిపోతున్న గ్లేసియర్లు, గ్రీన్‌లాండ్ మంచు ఫలకం ద్రవ్యరాశి వంటివి కూడా ఆందోళనకర రీతిలో రికార్డులు సృష్టిస్తున్నాయి. సముద్రాలు అపూర్వమైన స్థాయిలో వేడిని గ్రహించడం వల్ల ఉపరితల జలాలు వేడెక్కి 'సూపర్ ఎల్ నినో' వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

భూతాపం రేటు కూడా వేగవంతమవుతోంది. 1970–2010 మధ్య దశాబ్దానికి 0.19ళీ సెంటీగ్రేడ్‌గా ఉన్న పెరుగుదల, ఇటీవలి కాలంలో 0.36ళీ సెంటీగ్రేడ్‌కు పెరిగింది. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

### ఆశాకిరణాలు.. హెచ్చరికలు

ఈ ఆందోళనకర పరిస్థితుల మధ్య కొన్ని ఆశాజనక పరిణామాలు కూడా ఉన్నాయి. బ్రెజిల్ అమెజాన్‌లో అటవీ నిర్మూలన వరుసగా నాలుగో ఏడాది తగ్గడం, సౌర, పవన విద్యుత్ వినియోగం 18 శాతం పెరగడం వంటివి సానుకూల అంశాలు. అయినప్పటికీ, 'యథాతథ వ్యాపార' ధోరణిని వీడి, తక్షణమే చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "వేగవంతమైన అస్థిరత అనేది ఇక భవిష్యత్తు హెచ్చరిక కాదు, అది ప్రస్తుత నిర్ధారణ" అని నివేదిక సహ–రచయిత విలియం రిపుల్ వ్యాఖ్యానించారు. ఈ మార్పులు భూమిని కోలుకోలేని 'టిప్పింగ్ పాయింట్ల' వైపు నెడుతున్నాయని నివేదిక హెచ్చరించింది.

# అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం



మొదటిపేజీ తరువాయి – వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ భూములను విక్రయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సుమారు 17,000 మంది రిటైర్డ్ ఉద్యోగులకు రూ.980 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు గతంలో సంఘాలు వెల్లడించిన నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

# ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి



మొదటిపేజీ తరువాయి – ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## డివిజన్ లలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలి

మాజీ కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్..



**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మంఖాల్ డివిజన్ 66, 67వ డివిజన్ లలో అభివృద్ధి కుంటుపడుతుందని పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని మాజీ కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్ తెలిపారు. మంఖాల్ డివిజన్ లలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కోరుతూ శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ మోహన్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. 66, 67వ డివిజన్ లలో పారిశుద్ధ్య పనులు, మంచినీటి ఎద్దడి, దోమల బెడద, రోడ్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని ఆయన ఆరోపించారు. పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అంటు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య పనులు రోడ్లు, మంచినీటి ఎద్దడిని తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## పోతర్ల సుదర్శన్ యాదవ్ కు సన్మానం చేసిన యాదవ సంఘం నేతలు



**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరం అఖిలభారత యాదవ సంఘం నేతలు శుక్రవారం మాజీ ఎంపీటీసీ, బిజెపి ఓబిసి మోర్చా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ ను మహేశ్వరం అఖిల భారత యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం యాదవ సంఘం అధ్యక్షుడు టి. లక్ష్మయ్య యాదవ్, పెద్ద గొల్ల మల్లేష్ యాదవ్, సెలవోజి జెల్ల నగేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘం నాయకులు శ్రీశైలం యాదవ్, చెన్నయ్య యాదవ్, రాజు యాదవ్, పాండు యాదవ్ పెద్దలు టి.శ్రీశైలం యాదవ్, కృష్ణ యాదవ్, వి.శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

## చింతిర్యాల కాలని పంచాయితీలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సర్పంచ్ ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో చెత్త తొలగింపు



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్ 17:-** చింతిర్యాల కాలనీ గ్రామపంచాయతీలో సర్పంచ్ కొరసా అలివేలు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు కి ఇరువైపులా చెత్తను శుభ్రం చేయించడం జరుగుతుంది గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్న వేళ సర్పంచ్ ఉప సర్పంచ్ దగ్గరుండి పనులను పర్యవేక్షించడం జరుగుతుంది గ్రామ పంచాయతీలోని ప్రజలు కూడా మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మురుగునీటిని బయటికి వదలకుండా ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని చెత్తను కూడా వారానికి మూడుసార్లు పంచాయతీ ట్రాక్టర్ వస్తుంది కనుక తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించడం జరిగింది అలాగే మీ పశువులను రోడ్లపై కట్టేయకుండా మీ స్థలాల్లోనే ఉంచుకోవాలని తెలియజేశారు గ్రామపంచాయతీ ప్రజలకు సహకరిస్తేనే పంచాయతీ అభివృద్ధి పథంలో ముందుంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్న అశోక్ కుమార్ కార్యదర్శి జ్యోతి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

## భీమారం శ్రీ నవదుర్గ భవాని ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో మహా చండీ యాగం





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా అక్టోబర్ 17 :** దుర్గా మాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమారం శ్రీ నవ దుర్గా భవాని ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గా మండపం వద్ద మహా చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యాగ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. తొలుత గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా చండీ యాగంలో భాగంగా వేద మంత్రాల పారాయణం, హోమ కార్యక్రమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు. యాగం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు, సర్పంచ్ పుష్క మల్ల విజయలక్ష్మి పున్నం చంద్, బిజెపి నాయకులు దుర్గం అశోక్, ఎస్సై రాజేందర్, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## ఫరీద్ పేట్ ఆడపడుచుకు బతుకమ్మ రోజు హాకీ పండుగ. హాకీలో శ్రావ్య ఎంపిక



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (పోరు తెలంగాణ న్యూస్:) :** తెలంగాణ ఆడపడుచుల పండగ బతుకమ్మ రోజు హాకీ లో సెలెక్ట్ కావడం ద్వారా కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్ పేట్ గ్రామానికి చెందిన తగిరంచ శ్రావ్య తండ్రి సంతోష్ రెడ్డి బతుకమ్మపండగను ఆడపడుచు హాకీ పండగ అని కొనియాడారు.ఎంపిక అవ్వడం ద్వారా హర్షం వ్యక్తపరిచారు. ఆటు అపోర్ట్స్ అథారిటీ ఆఫ్ కోల్లం కేరళ లో తనదైన శైలిలో శిక్షణ పొందుతూ తెలంగాణ ఆడపడుచుగా తెలంగాణకు హాకీ ని ఆడుతూ అలాగే తన విద్యను మధ్యప్రదేశ్ గ్వలియర్ జీవన్జీ యూనివర్సిటీలో అభ్యసిస్తూ ఈ క్రమంలోనే నిన్నటి రోజు మధ్యప్రదేశ్ గ్వలియర్ లో జరిగిన సెలక్షన్ ట్రాయల్స్లో శ్రావ్య సెలక్షన్ కావడం జరిగింది నవంబర్ 2 నుండి 7వ నవంబర్ వరకు రాజస్థాన్ జైపూర్ లో జరుగబోయే వెస్ట్ జోన్ యూనివర్సిటీ నేషనల్ ఛాంపియన్షిప్ కి మధ్యప్రదేశ్ జీవన్ యూనివర్సిటీ తరపున నేషనల్ టీం కి సెలెక్ట్ కావడం జరిగింది.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శేషగిరి నగర్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటన





**మణుగూరు అక్టోబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరి నగర్‌లో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పర్యటించి, కాలనీలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును వివరంగా తెలుసుకున్నారు.

**ప్రజల వద్దకే వెళ్లి సమస్యలపై ఆరా**

ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరుతోందా లేదా అనే విషయాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటిని పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ప్రజలతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదలకు అండ**

కాలనీలో సొంత ఇళ్లు లేని నిరుపేద కుటుంబాల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు**

శేషగిరి నగర్‌లో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు అవసరమున్నాయి, ఏ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి, రహదారుల పరిస్థితి ఎలా ఉందనే అంశాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలి**

కాలనీలో తాగునీటి సరఫరా పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజలకు ప్రతిరోజూ అవసరమైన మేరకు తాగునీరు అందుతోందా, నీటి సరఫరాలో ఏవైనా అంతరాయాలు ఉన్నాయా, ఏ ప్రాంతాల్లో నీటి సమస్యలు ఎదురవుతున్నాయనే వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని, అవసరమైన చోట పైపులైన్లు, సరఫరా వ్యవస్థలోని సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. తాగునీటి విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**పారిశుధ్య నిర్వహణపై అధికారులకు సూచనలు**

కాలనీలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజారోగ్యానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

**సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల అవసరాలను గుర్తిస్తూ, కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా వంటి ప్రజల నిత్యజీవితానికి అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం**

శేషగిరి నగర్ పర్యటనలో ప్రజలు వెల్లడించిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన పేద కుటుంబాల గుర్తింపు, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం, కాలనీలను పరిశుభ్రంగా ఉంచడం, అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన వారికి అందించడం తమ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, వారి సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ, శేషగిరి నగర్‌తో పాటు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సీతారామ ప్రాజెక్టుతో కరువు కాలంలోనూ సాగుకు భరోసా

కేసీఆర్ ముందుచూపుతోనే
సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత
మారెళ్లపాడు రైట్ కెనాల్
పనులు తక్షణమే ప్రారంభించాలి
గోదావరి జలాలతో
తుమ్మల చెరువును నింపాలి
అధికార పార్టీ నాయకులు
దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలి
రైతులపై చిత్తశుద్ధి ఉంటే
రైతు బీమాను కొనసాగించాలి.
బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు
కోడి అమరేందర్ డిమాండ్



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం,అక్టోబర్ 17:-** రైతుల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు,దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకుని,అన్నదాతల సంక్షేమంపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అధికార పార్టీ నాయకులకు హితవు పలికారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని,సాగునీటి రంగంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూర్చాయని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు,సాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కరువు కాలంలో రైతులకు అండగా సీతారామ ప్రాజెక్టు నిలిచిందని,వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ రైతుల పంటలకు సాగునీరు అందించడంలో సీతారామ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తోందని కోడి అమరేందర్ అన్నారు.గోదావరి జలాలను సాగుభూములకు మళ్లించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం ప్రాంతంతో పాటు పలు జిల్లాల్లోని రైతులకు ప్రయోజనం చేకూర్చే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అనేది కేవలం నిర్మాణ పనులకు పరిమితం కాకుండా, రైతుల భవిష్యత్తుకు భరోసా కల్పించే అంశమని తెలిపారు.గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించే విషయంలో చూపుతున్న శ్రద్ధను స్థానిక ప్రాంతాల రైతుల సాగునీటి అవసరాలపైనా చూపాలని మంత్రులకు సూచించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆ నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కేసీఆర్ ముందుచూపుతోనే సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చారని, తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి రంగానికి కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని కోడి అమరేందర్ పేర్కొన్నారు.రైతులకు సాగునీరు అందుబాటులో ఉంటేనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని భావించి పలు ప్రాజెక్టులు, సాగునీటి పథకాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.రైతులకు పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో రైతుబంధు పథకాన్ని, రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. ఈ పథకాలు రైతుల్లో భరోసా కల్పించాయని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే నాయకులు గతంలో అమలైన పథకాలు, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వాస్తవాలను పరిశీలించాలని సూచించారు.రైతులపై ప్రేమ మాటల్లో కాదు,చేతల్లో చూపాలని,రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే రైతుబీమా పథకాన్ని కొనసాగించాలని కోడి అమరేందర్ డిమాండ్ చేశారు.వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు రైతుబీమా ఎంతో ముఖ్యమైన భరోసా అని, రైతు కుటుంబం ఆర్థికంగా సంక్షోభంలో పడకుండా ఇటువంటి పథకాలు తోడ్పడతాయని అన్నారు.ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించకూడదని, రైతులకు అవసరమైన పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రైతుల సమస్యలపై రాజకీయ ఆరోపణలు చేయడం కంటే, వారి కష్టాలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపడం ముఖ్యమని స్పష్టం చేశారు.మారెళ్లపాడు రైట్ కెనాల్ పనులు వెంటనే ప్రారంభించాలని,మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను వినియోగించుకునేలా అవసరమైన కాలువల పనులను వేగవంతం చేయాలని కోడి అమరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా మారెళ్లపాడు రైట్ కెనాల్ పనులను తక్షణమే ప్రారంభించి, సాగునీరు అందాల్సిన ప్రాంతాలకు నీటిని చేరవేసేలా కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.కాలువల పనుల్లో జాప్యం జరిగితే సాగు ప్రణాళికలు దెబ్బతిని రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రాజెక్టుల ద్వారా నీటిని పంపింగ్ చేయడం మాత్రమే కాకుండా,ఆ నీరు రైతుల పొలాలకు చేరే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.తుమ్మల చెరువును గోదావరి జలాలతో నింపాలని,తుమ్మల చెరువు ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని కోడి అమరేందర్ అన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువుకు మళ్లించి, చెరువును నింపేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువులో నీరు అందుబాటులో ఉంటే పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి వెసులుబాటు కలుగుతుందని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు మేలు జరుగుతుందని తెలిపారు.సాగర్ ఆయకట్టు భూములకు నీరు అందించే అంశంతో పాటు,స్థానిక చెరువులు, కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించే విషయంలోనూ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.నీటి పంపిణీలో ప్రాంతీయ అవసరాలను పరిగణనలోకి తీసుకుని, చివరి ఆయకట్టు రైతులకు కూడా న్యాయం చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ,పాలకుల ప్రాధాన్యత కావాలని,ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, రైతులకు సాగునీరు అందించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు చేపట్టడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతలని కోడి అమరేందర్ పేర్కొన్నారు.రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలతో రైతుల సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో పనులు చేపట్టినప్పుడే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.రైతు బీమా పథకాన్ని కొనసాగించడం, మారెళ్లపాడు రైట్ కెనాల్ పనులు ప్రారంభించడం, తుమ్మల చెరువును గోదావరి జలాలతో నింపడం వంటి డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి పనులకు ప్రాధాన్యత ఇచ్చి, వ్యవసాయ రంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ డిమాండ్ చేశారు.లేని పక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ అధ్వర్యంలో తీవ్రమైన ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని,ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో దళితులు కోల్పోయిన హక్కులను కల్పించాలి



మాల సంఘాల జేఏసీ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్ డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 17:-** ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులు అనేక సంవత్సరాలుగా తమకు దక్కాల్సిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి అవకాశాలకు దూరమవుతున్నారని మాల సంఘాల జేఏసీ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో దళితుల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్రంగా పరిశీలన జరిపి, వారు కోల్పోయిన హక్కులను గుర్తించి, తిరిగి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా దళితుల భూములు, విద్య, ఉపాధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి అందేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో దళితులకు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో దళితులకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించే వరకు తమ హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ధ్రువకుమార్, చెట్టి మనోజ్, మేకల భాస్కర్, ఉండేటి రాజేష్, కరకపల్లి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు...

# మెగా అభిమానులంతా ఏకతాటిపైకి రావాలి!

## ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్‌కు మద్దతుగా నిలవాలి

## తెలంగాణ రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ జాయింట్ కన్వీనర్ కాస రాజు పిలుపు

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 17(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** మెగా అభిమానులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ, జనసేన పార్టీ నాయకత్వం ప్రకటించిన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ జాయింట్ కన్వీనర్ కాస రాజు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్‌కు మద్దతుగా మెగా అభిమానులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా కాస రాజు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని మెగా అభిమానులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మెగా అభిమానులు, జనసేన పార్టీ శ్రేణులు, మిత్రులు, శ్రేయోభిలాషులు కలిసి పనిచేస్తూ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

**పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**

డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాస రాజు సూచించారు. మెగా అభిమానులతో పాటు వారి మిత్రులు, శ్రేయోభిలాషులు కూడా అర్హత నిబంధనలకు అనుగుణంగా పట్టభద్రుల ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకునేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

**సందేహాలుంటే సంప్రదించండి**

పట్టభద్రుల ఓటరు నమోదు గడువు నవంబర్ 6వ తేదీగా ఉందని పేర్కొంటూ, అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కాస రాజు విజ్ఞప్తి చేశారు. ఓటరు నమోదు విషయంలో ఏవైనా సందేహాలు ఉన్నా, సహాయం అవసరమైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8978113833
కాస రాజు
తెలంగాణ రాష్ట్ర జాయింట్ కన్వీనర్
మెగా యూత్ ఫోర్స్



# వేతనాల పెంపు, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు కోసం అక్టోబర్ 26న చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

## సిఐటియు

**పోరు తెలంగాణ నెక్కొండ, అక్టోబర్ 17 :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నెక్కొండ మండల అధ్యక్షులు బానోతు దేవేందర్ అధ్యక్షతన అంబేద్కర్ సెంటర్లో చలో హైదరాబాద్ కార్యక్రమ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి వెంకటయ్య హాజరై మాట్లాడుతూ, సిఐటియు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 26న పంచాయతీ ఉద్యోగ, కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ప్రభుత్వాలు ఎన్ని మారినా కనీస వేతనాలు గానీ, పర్మనెంట్ గానీ నోచుకోని దుస్థితి ఉందని, చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వెట్టి చాకిరి విముక్తి జరిగిందని అంటున్నారని, కానీ పంచాయతీ ఉద్యోగులకు మాత్రం వెట్టి చాకిరి తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానం వల్ల దినదిన గండంలా బతుకుతున్నారని, ప్రస్తుతం నూతన పాలకవర్గం ఏర్పడిన నాటి



నుండి తీవ్ర పని ఒత్తిడి పెరిగిందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం చాలా దారుణమని, గత పిఆర్సి ప్రకారం ఇతర శాఖల ఉద్యోగులకు రూ. 15,600 చెల్లించినప్పటికీ పంచాయతీ ఉద్యోగులను ఆ పరిధిలోకి తీసుకోకపోవడం తీరని అన్యాయమని, నేటికీ రూ. 9,500 వేతనమే చెల్లిస్తున్నారని అన్నారు.

**ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ:**

పంచాయతీ సిబ్బందిని పిఆర్సిలో గుర్తించి, రెండో పిఆర్సి ప్రకటించాలి కనీస వేతనం రూ. 30,000 గా నిర్ణయించి, పంచాయతీ ఉద్యోగుల మెడకు ఉరితాడుగా ఉన్న మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి సిబ్బంది అక్రమ తొలగింపులపై కఠిన చర్యలు చేపట్టాలి విస్తరణకు అనుగుణంగా నియమించిన అదనపు కార్మికుల పేర్లను అన్నింటినీ ఆన్లైన్లో నమోదు చేయాలి అక్టోబర్ 26న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు లిఈదునూరి సాయిలు, మెరుగు మదార్, కనకం కృష్ణ, సింగారపు యాకయ్య, కరుణాకర్, జన్ను సూరమ్మ, యాకలక్ష్మి, బుజ్జమ్మ, బిర్రు లక్ష్మణ్, సింగారపు స్వామి, ఈదునూరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎక్కడ?

## రుద్రంపూర్, ధన్బాద్‌లో సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు!

## పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

**కొత్తగూడెం ఆర్సీ, అక్టోబర్ 17(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం) :** గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్, ధన్బాద్ గ్రామపంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రుద్రంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి సాగర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పూల రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా క్షీణించిందని విమర్శించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.

**మురుగు కాలువలు, వీధిలైట్ల నిర్వహణ గాలికి!**

గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, శ్మశానవాటికలు, మురుగు కాలువలు, వీధిలైట్లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం లేదని, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు గ్రామాల్లో కోతులు, వీధికుక్కలు, పందుల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్యానికి ముప్పు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కోరారు.

**సమస్యలు పరిష్కరించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన**

రుద్రంపూర్, ధన్బాద్ గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన పారిశుద్ధ్య



సౌకర్యాలు కల్పించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధన్బాద్ సర్పంచ్ గుగులోత్ జ్యోతి, మాజీ సర్పంచ్ బానోతు రాందాస్, రుద్రంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి సాగర్, మాజీ ఉపసర్పంచ్ భూక్య రవి, వార్డు సభ్యులు కృష్ణవేణి, స్వరూప, సీనియర్ నాయకులు కలకోట ఐలయ్య, మందుల జయరాజ్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు రవి, ముఖేష్, బావు సతీష్, జలీల్, అజర్ తదితరులు పాల్గొన్నారు. రుద్రంపూర్, ధన్బాద్ గ్రామపంచాయతీ కార్యదర్శులు భూమికకు నాయకులు వినతిపత్రాలు అందజేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎక్కడ?

# మిట్టగూడెంలో సమస్యలు పరిష్కరించండి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు : పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం

## బతుకమ్మ పండుగ వేళ వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తీర్చాలని డిమాండ్

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం (ప్రతినిధి) అశ్వాపురం, అక్టోబర్ 17 :-** మిట్టగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోర్స దుర్గారావు



నేతృత్వంలో నాయకులు పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ సంబరాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా వీధుల్లో వెలగని విద్యుత్ దీపాలను వెంటనే బాగు చేసి నూతన లైట్లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు, గ్రామస్తులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి కొరత రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. ?పండుగ వేళ గ్రామాలు పరిశుభ్రంగా, వెలుగులతో కళకళలాడేలా పాలకవర్గం, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన నాయకులు మామిళ్ల రాము, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చల్లా రాజేష్, నాయకులు మందడపు నరేష్, పాలకుర్తి నాగేశ్వరరావు, బొల్లు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా అందరూ పాల్గొని దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17(పోరు తెలంగాణ న్యూస్:) :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను షబ్బీర్ అలీ స్వయంగా పరిశీలించి కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఈ ఉత్సవాలను కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ కలిసి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు పంపించి ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

**అన్ని శాఖల అధికారులతో సమీక్ష.**

దసరా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, క్రీడలు, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులతో షబ్బీర్ అలీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే ప్రజల భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రజల సౌకర్యాలకు ప్రత్యేక ఏర్పాట్లు**

ఉత్సవాలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీటి సదుపాయం, భద్రతా ఏర్పాట్లు, మరుగుదొడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలను



వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు, పాత్రికేయ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇన్విజిబుల్ థాట్స్, ఇన్విజిబుల్ రియాలిటీ పుస్తకాన్ని ఆవిష్కరించిన దుర్గం అశోక్





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 17 :** భీమారం మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి పూర్ణచంద్ రచించిన ఇన్విజబుల్ థాట్స్ ఇన్విజబుల్ రియాల్టీ పుస్తకాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెన్నూర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే దుర్గం అశోక్ దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచందను అభినందించారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని కోరారు యువత అంతా పూర్ణచందు ను ఆదర్శంగా తీసుకొని చదువుల్లో రాణించాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోర్లకుంట శంకర్ ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్, మండల ఉపసర్పంచ్ ఫోరం ఉపాధ్యక్షులు దుర్గం జనార్ధన్, బిజెపి నాయకులు ఆకుదారి శంకర్ ,తాటి సమ్మగౌడ్, ఆకుదారి చంద్రయ్య, మల్లేష్, అరుణ్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ముందు చూపు లేకనే విద్యుత్ కోతలు ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి





**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:అక్టోబర్ 17(పోరు తెలంగాణ న్యూస్) :** ఎలెనినో వల్ల సమస్య ఉంటుందని 6 నెలల ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు గత ప్రభుత్వాన్ని విమర్శించడం పై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదుఈ పంట కి నీళ్ళు ఇవ్వాలి, యాసంగి పంటకి ప్రణాళిక తయారు చేయాలిలేకపోతే త్రాగు నీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందికామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డిలి రైతులకు కోతలు లేని నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనత పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మరియు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ల ఆధ్వర్యంలో సబ్ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేయటం జరిగింది. అనంతరం విద్యుత్ ఎస్ ఈ సాల్య నాయక్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు, బీజేఎల్పీ ఉపనేత కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందు చూపు లేకనే రైతులు విద్యుత్ కోతలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎలెనినో వల్ల సమస్య ఉంటుందని 6 నెలల ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదనీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వాన్ని విమర్శించడం పై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదనీ అన్నారు. ఈ పంట కి నీళ్ళు తప్పనిసరిగా ఇవ్వాలనీ , యాసంగి పంటకి క్యాబ్ ప్రణాళిక ఇప్పుడే తయారు చేయాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే త్రాగు నీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందనీ అన్నారు.

# ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

## 24 గంటల విద్యుత్ ను అందించాలి..

## మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..

**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అమీర్ పేట్ గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఐదు, ఆరు



గంటల పాటు విద్యుత్ సరఫరా అందించడం వల్ల వరి, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆమె పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల విద్యుత్ ను రైతులకు అందించి రైతులను ఆదుకోవడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో వ్యవసాయం సస్యశ్యామలంగా ఉండేదని అన్నారు. నీరు లేక విద్యుత్ సరఫరా కాక టమాట, వరి నారు ఎండిపోతుందని ఆమె ఆవేదన వ్యక్తపరిచారు. అప్పులు చేసి పంట వేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఎల్ నీ వో ప్రభావం వల్ల రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించడం ప్రభుత్వం బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని ఆమె కోరారు. పంటలు చేతికి వచ్చే సమయంలో ఇలాంటి సమస్యలు ఎదురు కావడం వల్ల రైతుల కుటుంబాల ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. అమీర్ పేట్ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యుత్ అధికారులు నెరవేర్చాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, అమీర్ పేట్ గ్రామ సర్పంచ్ పోతుల మల్లమ్మ నారాయణ సర్పంచులు మునగపాటి న వీన్ బండారి లింగం రాయప్ప, అరడి వెంకటేష్ యాదవ్, విద్యుత్ ఏఈ చక్రపాణి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

## సర్పంచ్ ధార నరసింహ..



**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని గొల్లూరు గ్రామ సర్పంచ్ ధార నరసింహ అన్నారు. శనివారం పోలేపల్లి యాదమ్మ ఇంటి నుండి పెండ్యాల బిక్షపతి ఇంటి వరకు సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో రోడ్లు, మంచినీరు, విద్యుత్తు, డ్రైనేజీ పనులపై దృష్టి సారించడం జరిగిందని అన్నారు. పెండింగ్ పనులను దశలవారీగా చేపట్టి పూర్తి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు రాజకీయాలకతీతంగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలిగని రమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కల్పనా రెడ్డి వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మణపురం గోల్డ్ ఫైనాన్స్ కంపెనీని ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరం పట్టణ కేంద్రంలో పోల్కం బాలయ్య బిల్డింగ్ లో శనివారం మణపురం గోల్డ్ ఫైనాన్స్ కంపెనీని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. మణపురం




గోల్డ్ కంపెనీ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మణపురం గోల్డ్ మేనేజర్ సాయి, సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి సర్పంచ్ మునగపాటి నవీన్, ఉపసర్పంచ్ జోరల రమేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఆదిల్ అలీ, పిఎసిఎస్ డైరెక్టర్లు కాడ మోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, నాయకులు కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, ఆనందం, నిమ్మగూడెం సుధీర్ గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమంలో బిజెపి నేతలు



**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాసేవయే లక్ష్యంగా సమాజ హితమే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. హెల్మెట్లను ధరించి వాహనాలను నడపాలని డ్రైవింగ్ చేస్తూ మొబైల్ మాట్లాడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయకిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యదర్శి పాండు నాయక్ నాయకులు దేవేందర్ రెడ్డి, నారాయణ యాదవ్, నరసింహ, యాదయ్య గౌడ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు యదీష్, వనంపల్లి శ్రావణ్, మోతె యాదయ్య, రఘువీర్, బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

## ఆట పాటలతో హోరెత్తించిన మహిళా సంఘాలు..



**మహేశ్వరం, అక్టోబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కందుకూరు మండలం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘం సభ్యులు బతుకమ్మ ఆట,పాటలతో హోరెత్తించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని వక్తలు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా అదనపు డిఆర్డిఓ జోజప్ప హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీఎం సత్యనారాయణ, మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, వివోలు పాల్గొన్నారు.

# వైద్య చికిత్సకు అండగా పినపాక ఎమ్మెల్యే, మద్దెల సంతోషకు రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేత



**మణుగూరు అక్టోబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన మద్దెల సంతోషకు వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల విలువైన ఎల్ఓసీ ని లిపినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పాటునందించనుంది. ప్రజల ఆరోగ్య అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కోసం రూ.3 లక్షల ఎల్ఓసీ మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొమురం భీమ్ వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

## జోడేఘాట్‌లో అధికారుల సమీక్ష....

## అసౌకర్యం కలగొద్దని సూచన....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో శనివారం జరిగే ఆదివాసీ వీరుడు కొమరం భీమ్ వర్ధంతి ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం పరిశీలించారు. వర్ధంతికి ఆదివాసీలు, ప్రజలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. వారికి ఇబ్బంది లేకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, రాకపోకలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. జనసందోహం నియంత్రణ, వాహనాల క్రమబద్ధీకరణ, అత్యవసర సమయాల్లో తక్షణ స్పందనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ ఆత్రం భాస్కర్, సీఐ వేణుగోపాల్, ఎస్సై రాజు, ఏటీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐ లవ్ ఓదెల లోగో ఆవిష్కరణ

## ఓదెల లో ముందస్తు బతుకమ్మ వేడుకలు.

## సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ ఆధ్వర్యంలో






**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా ఓదెల గ్రామ పంచాయతీ ఆవరణ లో శుక్రవారం సాయంత్రం సర్పంచ్ డాక్టర్ కనికిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలకవర్గం సభ్యులు , గ్రామ స్థాయి మహిళా ఉద్యోగులు అంగన్వాడీ,ఆశా కార్యకర్తలు,మహిళా సంఘాల సీఏ లు పాల్గొని బతుకమ్మ ను పేర్చి ఆట పాటలతో ఆనందోత్సవాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు .అనంతరం మహిళలకు సరదాగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరిగింది.సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ చేతుల మీదుగా పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ ముందు ఉన్న ఐ లవ్ ఓదెల బోర్డు ఆవిష్కరణ చేశారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకట లక్ష్మణ్ ఉప సర్పంచ్ గోపతి శ్రీలత వార్డ్ సభ్యులు రాపల్లి రాజయ్య, దూరం సదానందం, అప్పని తిరుపతి,చింతం విజయ స్వామి, పెండం లక్ష్మీ ఓదెలు, బుద్దే తిరుమల రవి, ,,సిరిగిరి ఎల్లక్క రాజారాం,గొర్ల శ్రీనివాస్,ముద్దసాని కిరణ్ చింతం తిరుపతి, రాచర్ల అశోక్, కొంద్ర లక్ష్మణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా :** భీమారం గ్రామపంచాయతీలో అర్హులైన లబ్ధిదారులకు సర్పంచ్ పుష్పమల్ల విజయలక్ష్మి పున్నం చంద్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను లబ్ధిదారులు పొందవచ్చని తెలిపారు.

# బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు అరకొరగా ఎలా చేస్తారు?

## ధన్నాబ్ద్ చెరువు ఘాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

## లైటింగ్, పారిశుద్ధ్యం, ఘాట్ల వద్ద వసతులు మెరుగుపరచాలి: పూల రవీందర్ డిమాండ్



**కొత్తగూడెం ఆర్సీ, అక్టోబర్ 17(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కార్మిక ప్రాంత ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పూల రవీందర్ డిమాండ్ చేశారు. రుద్రంపూర్, ధన్నాబ్ద్, గౌతంపూర్ ప్రాంతాల ప్రజలు బతుకమ్మ నిమజ్జన వేడుకల్లో పాల్గొనే ధన్నాబ్ద్ చెరువు ఘాట్లను బీఆర్ఎస్ నాయకులు సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం జరగనున్న బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి ఘాట్ల వద్ద చేపట్టిన పనులను పరిశీలించిన నాయకులు, ఏర్పాట్లలో లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఫ్యామిలీ డేకు హడావుడి.. అసలు పండుగకు అరకొర ఏర్పాట్లా?**

ఈ సందర్భంగా పూల రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ముఖ్యంగా సింగరేణి కార్మికులు నివసించే రుద్రంపూర్, ధన్నాబ్ద్, గౌతంపూర్ ప్రాంతాల్లో పండుగను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం గ్రామపంచాయతీలు, సింగరేణి యాజమాన్యం బాధ్యత అని అన్నారు. సింగరేణి అధికారులు ఫ్యామిలీ డే పేరుతో ఒకరోజు ముందుగానే బతుకమ్మ ప్రగతి వనంలో విద్యుత్ దీపాల వెలుగులో కార్యక్రమాన్ని నిర్వహించి ముగించారని, అయితే అసలు బతుకమ్మ నిమజ్జన వేడుకల కోసం మాత్రం తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు.

**లైటింగ్ తొలగింపు.. చెరువులో పూడిక సమస్య!**

బతుకమ్మ ప్రగతి వనంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను తొలగించారని, ప్రస్తుతం నామమాత్రపు లైటింగ్ మాత్రమే ఉందని పూల రవీందర్ ఆరోపించారు. ధన్నాబ్ద్ చెరువులో పేరుకుపోయిన పూడికను కూడా పూర్తిస్థాయిలో తొలగించలేదని పేర్కొన్నారు. బతుకమ్మ ఆడుకునే ప్రదేశాలు, నిమజ్జన ఘాట్ల వద్ద తగిన వెలుతురు, పరిశుభ్రత, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు పండుగలో పాల్గొనే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

**మూడు గ్రామపంచాయతీలు సమన్వయంతో పనిచేయాలి**

రుద్రంపూర్, ధన్నాబ్ద్, గౌతంపూర్ గ్రామపంచాయతీల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మూడు గ్రామపంచాయతీల ప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో ప్రణాళిక రూపొందించి ఉంటే మరింత మెరుగైన ఏర్పాట్లు చేయడానికి అవకాశం ఉండేదని పూల రవీందర్ అభిప్రాయపడ్డారు. సింగరేణి అధికారులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కొన్ని అంశాలపై అవగాహన లోపం ఉండవచ్చని పేర్కొంటూ, ఇంకా సమయం ఉన్నందున తక్షణమే స్పందించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్‌ను పెంచడంతో పాటు, చెరువు పరిసరాలను శుభ్రం చేసి, పండుగ నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించాలని సింగరేణి యాజమాన్యం, గ్రామపంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు.

**పరిశీలనలో పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి సాగర్, ధన్నాబ్ద్ మాజీ ఉపసర్పంచ్ భూక్య రవి, సీనియర్ నాయకులు కలకోటి ఐలయ్య, మందుల జయరాజు, సతీష్, ముఖేష్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మినీ ఫంక్షన్ హాల్, సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



**మణుగూరు అక్టోబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరి నగర్‌లో హనుమాన్ టెంపుల్ వద్ద నూతనంగా నిర్మించిన అభివృద్ధి పనులను లిపినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో మొత్తం రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనుల్లో రూ.10 లక్షలతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.

**ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మినీ ఫంక్షన్ హాల్**

శేషగిరి నగర్ ప్రజలు వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయోగపడనుంది. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

**మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు**

అదేవిధంగా రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ : కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం అక్టోబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ శాఖ, మున్సిపాలిటీలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మెప్మా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా అధికారులు, ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, కోలాటాలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని, పూలను, మహిళలను గౌరవించే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు . మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఉద్యోగ విధుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడంతో పాటు, పరస్పర స్నేహభావం, ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పినపాక మండలంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**పినపాక, అక్టోబర్ 17: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం, ఆహార భద్రతకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని లిపినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ) కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, లిరాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి లి మార్గదర్శకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు పారదర్శకంగా రేషన్ సరుకులు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు రేషన్ కార్డులు ఆహార భద్రతకు ముఖ్యమైన ఆధారమని, ప్రభుత్వ నిబంధనలు, అర్హతలను బట్టి వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కూడా ఉపయోగపడతాయని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లి స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఆర్ఓ, సంబంధిత శాఖల అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# భీమారం ఎంపీపీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా అక్టోబర్ 17 :** భీమారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలకు డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీడీవో వీణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సతీష్ రెడ్డి, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ ప్రతిభ పురస్కారం అందుకున్న ప్రవీణ్





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఈ పురస్కారాలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన ముమ్మడి ప్రవీణ్, 10వ తరగతి అధ్యక మార్కులు సాధించిన ముమ్మాడి ఆశ్రిత, , విశ్వబ్రాహ్మణ సమాజ అభివృద్ధికి విశేష కృషి చేసిన, ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురిని ఆరోమా బ్యాకెట్ హాల్ పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో సన్మానించి, అవార్డులను ప్రదానం చేశారు. యువత చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పెద్దపల్లి సీ ఐ కొండపాక కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారోజు సుదర్శన్ చారి, జిల్లా అధ్యక్షుడు వైకుంఠశీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, రామగుండం డివిజన్ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్, ట్రెజరర్ కట్టా జితేందర్, కట్టా రవీందర్ చారి, గద్దె జగదీశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతులకు 18 గంటల కరెంటు సరఫరా చేయాలి

మిర్చి సాగు చేస్తున్న రైతులతో సమావేశం....

సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కౌటాల మండలం, చింతలమానేపల్లి మండలాలలో మిర్చి సాగుచేస్తున్న రైతులతో ఏర్పాటు చేసిన సమావేశం సందర్భంగా మిర్చి రైతులు తమకు పగటిపూట 12 గంటలు, రాత్రి పూట 6 గంటలు మొత్తం 18 గంటలు కరెంటు సరఫరా చేయాలని సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు కోరారు. ఈ రోజు సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉత్తర తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సిఎండీ వరుణ్ రెడ్డి గారితో మాట్లాడటం జరిగిందని అన్నారు .పగటిపూట 12 గంటలు, మరియు రాత్రి(రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు) 6 గంటల విద్యుత్ సరఫరా ద్వారా మిర్చి రైతులకు 18 గంటల విద్యుత్ సరఫరా చేయడానికి వారు అంగీకరించారని తెలిపారు. ఈ విషయాన్ని మిర్చి రైతులు గమనించి విద్యుత్ అధికారులు మరియు వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుని మిర్చి పంటను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# భీమారం మండల కేంద్రంలో దుర్గామాతను దర్శించుకున్న దుర్గం అశోక్





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 17 :** బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెన్నూర్ నియోజకవర్గం కాంటె స్టేడ్ ఎమ్మెల్యే దుర్గం అశోక్ సతీ సమేతంగా శ్రీ నవదుర్గా భవాని ఉత్సవ సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపం వద్ద నిర్వహించిన మహా చండీ యాగం లో పాల్గొనేవారు. పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దుర్గామాత కమిటీ సభ్యులు అశోక్ దంపతులను శాలువతో సన్మానించారు.,ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్,మండల ఉపసర్పంచ్ ఫోరం ఉపాధ్యక్షుడు దుర్గం జనార్దన్ , బిజెపి నాయకులు ఆకుదారి శంకర్,తాటి సమ్మగౌడ్, ఆకుదారి చంద్రయ్య, మల్లేష్, అరుణ్ లు పాల్గొన్నారు.

# గ్రామోద్యోగు వికాస్ యోజన పథకం ద్వారా కుమ్మరి సారె నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ప్రారంభం



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా ప్రతినిధి :** ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో చెన్నూరు మండలంలోని లోని సుబ్బరాంపల్లి గ్రామంలో గ్రామోద్యోగు వికాస్ యోజన 2026 సంబంధించి కుమ్మరి సారె నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు . ఈ శిక్షణలో భాగంగా 20 మందికి, దాదాపు 10 రోజులు ట్రైనింగ్ ఇచ్చి, ఎలక్ట్రికల్ వీల్స్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని కత్తెరసాల గ్రామ సర్పంచ్ పద్మ- మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరీ తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాంపల్లి శ్రీనివాస్, అక్కే పెల్లి గ్రామ ఉపసర్పంచ్ రాతిపల్లి రమేష్, జిల్లా నాయకులు శనిగారపు తిరుపతి, కెల్లేటి తిరుపతయ్య, మాస్టర్ ట్రైనర్ రాతిపల్లి నగేష్, మాజి ఉప సర్పంచ్ రాతిపల్లి సంతోష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేకు 6 జీఎన్ఎస్ఎస్ రోవర్లు

మండల సర్వేయర్లకు అందజేసిన కలెక్టర్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భూ రీ-సర్వే పనులను వేగంగా, గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆదేశాల మేరకు కొనుగోలు చేసిన 6 జీఎన్ఎస్ఎస్ రోవర్లను కలెక్టర్ కె.హరిత శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మండల సర్వేయర్లకు అందజేశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ పరికరాలతో గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, భూముల క్షేత్రస్థాయి పరిశీలన వంటి సర్వే పనులు వేగంగా, కచ్చితంగా పూర్తవుతాయి. దీంతో రీ-సర్వేలో జాప్యం తగ్గుతుంది. అధికారులు, మండల సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఓటరు జాబితా సవరణ గడువులోగా పూర్తి చేయాలి

కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మ్యాపింగ్ కాని, అనమలీ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, విచారణ (హియరింగ్) ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటికే 94 శాతం హియరింగ్ పూర్తయిందని అదనపు కలెక్టర్ వివరించారు. గడువులోగా నూరు శాతం పూర్తి చేసి, అర్హులందరి పేర్లు జాబితాలో ఉండేలా చూస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఫారం 6, 7, 8 దరఖాస్తులు 5,220 వచ్చాయని, వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు.

# 34 సబ్‌స్టేషన్లు స్కాడాతో అనుసంధానం

రియల్‌టైమ్ ఫీడర్ పర్యవేక్షణతో మెరుగైన విద్యుత్ సేవలు....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలోని మొత్తం 34 సబ్‌స్టేషన్లను స్కాడాతో అనుసంధానించినట్లు సూపరింటెండింగ్ ఇంజినీర్ ఉత్తమ్ జాడే శనివారం వెల్లడించారు. రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్టీఎఫ్ఎంఎస్) అమలులో భాగంగా ఈ అనుసంధానం పూర్తయింది. ఈ విధానంలో ఫీడర్ల పనితీరును స్కాడా కంట్రోల్ రూమ్ నుంచే ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. విద్యుత్ అంతరాయం, ఓవర్‌లోడ్, వోల్టేజ్ హెచ్చుతగ్గులు వంటి సమస్యలు తలెత్తిన వెంటనే హెచ్చరికలు వస్తాయి. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది త్వరగా స్పందించి, అంతరాయ సమయాన్ని తగ్గించి, సరఫరాను వేగంగా పునరుద్ధరించగలరు. విద్యుత్ వినియోగం, వోల్టేజ్, లోడ్ వివరాలను విశ్లేషించి, సమస్యలను ముందే గుర్తించి నివారణ చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుంది. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యమని ఎస్ఈ స్పష్టం చేశారు.

# దుర్గా పూజ భద్రతకు ఎస్సైకి వినతి

బెంగాలీ క్యాంప్ పండాల్‌ల వద్ద పోలీసు సిబ్బందిని నియమించాలని కోరిక....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కగజ్ నగర్ మండలం ఈస్గావ్ గ్రామంలో దుర్గా పూజ పండుగ నేపథ్యంలో బెంగాలీ క్యాంప్‌లోని పూజా పండాల్‌ల వద్ద భద్రత పెంచాలని కోరుతూ స్థానిక వార్డు సభ్యుడు అమిత్ బిస్వాస్ ఈస్గావ్ ఎస్సై బి. నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. పండాల్‌ల వద్దకు భక్తులు, మహిళలు, పిల్లలు, పాదచారులు పెద్ద సంఖ్యలో వస్తారని, వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుందని వివరించారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, భక్తులకు రక్షణ కల్పించేందుకు ప్రధాన రహదారి కూడళ్లు, పండాల్‌ల ప్రవేశ ద్వారాల వద్ద పోలీసు సిబ్బందిని నియమించాలని కోరారు.

# అశ్వాపురం లో సమస్యలు పరిష్కరించండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు:సర్పంచ్ ఉపసర్పంచ్ కు వినతిపత్రం



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ- పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్:17:-** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు అశ్వాపురం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ సూచనల మేరకు లో బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం అశ్వాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ ఉపసర్పంచ్ తుళ్లూరు ప్రకాష్ రావు పంచాయతీ కార్యదర్శి యాకుబ్ కు బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో వీధి దీపాలు, విద్యుత్ లైటింగ్, పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరా తదితర సమస్యలపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అ కోరుతూ వినతి పత్రం అందజేశారు...అదేవిధంగా, చింతలచెరువు బతుకమ్మ గద్దెల వద్ద విద్య పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అశ్వాపురం గ్రామపంచాయతీ పాల్గొన్నవారు.. బి ఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ గద్దల రామకృష్ణ. బీసీ సెల్ అధ్యక్షుడు భాగవతపు సతీష్. మడిపల్లి రమేష్.. కొమ్ము రాంబాబు. బీసీ సెల్ ఉపాధ్యక్షులు అరసవెల్లి పవన్. సమ్మయ్య. యువజన నాయకులు పాల్గొన్నారు..

# కాయకల్ప్ అవార్డ్స్ 2025-26లో మంచిర్యాల జిల్లాకు ఘన విజయం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా,అక్టోబర్ 17, 2026 :** కాయకల్ప్ అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఘన విజయాన్ని సాధించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నర్సూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో టి.వి.వి.పి. వైద్యాధికారులను శాలువాతో సన్మానించి, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాయకల్ప్ అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచి 10 లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకోగా, చెన్నూరు ఏరియా ఆసుపత్రి, లక్షెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు కమెండేషన్ అవార్డులతో పాటు ఒక్కొక్కటి 1 లక్ష రూపాయల నగదు బహుమతిని సాధించాయని తెలిపారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ ప్రమాణాల మెరుగుదలకు వైద్యులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ విజయంలో 3 ఆసుపత్రుల పర్యవేక్షకులతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కృషి అభినందనీయమని తెలిపారు. ఆసుపత్రులలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ 3 ఆసుపత్రుల పర్యవేక్షకులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ మత గోవిందమ్మ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం



**పోరు తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి పటాన్చెరు నియోజకవర్గం అక్టోబర్ 17 :** పటాన్చెరులో శ్రీశ్రీశ్రీ మాత గోవిందమ్మ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసన్న దేవాలయం షష్టమ వార్షిక జగత్ కళ్యాణ మహోత్సవం కార్యక్రమం లో పాల్గొన్న కంజర్ల కృష్ణమూర్తి. పటాన్చెరులో శ్రీశ్రీశ్రీ మాత గోవిందమ్మ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసన్న దేవాలయం షష్టమ వార్షిక జగత్ కళ్యాణ మహోత్సవం కార్యక్రమానికి బిజెపి సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ మరియు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం పటాన్చెరు నియోజకవర్గ అధ్యక్షులు శ్రీ కంజర్ల కృష్ణమూర్తి పాల్గొనడం జరిగింది. శ్రీధర్ చారి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీధర్ చారి, సాయి వెంకట హర్ష చారి తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

# న్యాయస్థాన ఆవరణలో బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ....

ప్రధాన న్యాయమూర్తి....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయం ఆవరణలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శారదాదేవి, కలెక్టర్ కె.హరిత, న్యాయమూర్తులు అనంతలక్ష్మి, అనూష, ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణి కలిసి గౌరమ్మకు పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు.ప్రకృతిలో దొరికే పూలను బతుకమ్మగా పేర్చి దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. మన సంస్కృతిని కాపాడుకుని భావితరాలకు అందించాలని కలెక్టర్ సూచించారు.రంగోలి, ఇతర పోటీల్లో గెలిచినవారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓదెలలో నేత్రదానం

మరొకరి జీవితాల్లో వెలుగులు నింపిన పోలోజు నాగమణి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల, అక్టోబర్ 17: మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలనే గొప్ప ఆశయంతో ఓదెల గ్రామంలో నేత్రదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఓదెల గ్రామానికి చెందిన పోలోజు నాగమణి నేత్రదానం చేయడంతో గ్రామంలో 281వ నేత్రదానం పూర్తయింది. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మాచారి ఓదెల గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు. నాగమణి నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు అన్న వదిన పోలోజు రమేష్, పద్మ, అల్లుడు రాకేష్, మౌనిక, కుటుంబ సభ్యులు ముత్తూజు, భవాని, రమేష్‌లను ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ,క్యాతం మల్లేశం అభినందించారు. కుటుంబ సభ్యుల సహకారం, సామాజిక బాధ్యత పట్ల వారి నిబద్ధత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# 5కారుణ్య నియామకాల కింద ఆరుగురికి ఉద్యోగాలు

నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్.....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విధుల్లో ఉండగా మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో ఆరుగురికి కారుణ్య నియామకం కింద కలెక్టర్ కె.హరిత శనివారం నియామక పత్రాలు అందజేశారు. సమీకృత కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్‌తో కలిసి పత్రాలు ఇచ్చారు.వీరిలో ముగ్గురిని జూనియర్ అసిస్టెంట్లుగా, మరో ముగ్గురిని కార్యాలయ సబార్డినేట్లుగా వివిధ శాఖల్లో నియమించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉప పాలనాధికారి జాస్టిన్ జోయల్, కలెక్టరేట్ పరిపాలనాధికారి కిరణ్ కుమార్, కారుణ్య నియామక అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఈజ్‌గాంలో వ్యవసాయ డ్రోన్ ప్రారంభం

రూ.10 లక్షలతో కొనుగోలు చేసిన పీఏసీఎస్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామంలో కాగజ్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) రూ.10 లక్షలతో కొనుగోలు చేసిన వ్యవసాయ డ్రోన్‌ను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు శనివారం ప్రారంభించారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే సూచించారు. ఈ డ్రోన్‌తో రోజుకు 30 ఎకరాల వరకు పురుగుమందు పిచికారీ చేయవచ్చు. ఎకరానికి ఖర్చు రూ.300 నుంచి రూ.400 మాత్రమే. కూలీలు దొరకని ప్రస్తుత పరిస్థితుల్లో ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. ప్రారంభం అనంతరం ఈజ్‌గాం సమీపంలోని వరి పొలాలు, కంది చేలపై డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అగ్గిళ్ళ సంగీత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వరరావు, డైరెక్టర్లు ధరణి రమేష్, నానాజీ, తిరుపతి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, ఏడీఏ మనోహర్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏఈఓలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ 14వ వార్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటులి. స్పందించిన ఈవో రవికుమార్



**బూర్గంపాడు అక్టోబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ,సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 14వ వార్డులో ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా 14వ వార్డు మెంబర్ కొమరం సావిత్రి మాట్లాడుతూ.. వార్డు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ ఆదేశాల మేరకు, పంచాయతీ ఈవో జి. రవికుమార్ తక్షణమే స్పందించి సిబ్బందిని పురమాయించారని పేర్కొన్నారు. దెబ్బతిన్న విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయడంతో పాటు, పలు ప్రాంతాల్లో నూతన దీపాలను అమర్చినట్లు తెలిపారు. వార్డు ప్రజల సౌకర్యార్థం సకాలంలో స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించిన , ఈవో రవికుమార్ గ్రామపంచాయతీ సిబ్బందికి వార్డు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు